



గుంటూరు హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారం



ఎస్పీ తుషార్ దూడికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కలంపై దాడి.. సిగ్గు..సిగ్గు..

- గుంటూరులో వెల్లువెత్తిన నిరసనలు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం
- హిందూ కళాశాల కూడలిలో మానవహారం
- ఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, నినాదాలు
- విలేకర్లకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని డిమాండ్
- రాప్తాడు, కర్నూలు ఘటనలపై అఖిలపక్ష, జర్నలిస్టు సంఘాల ధ్వజం



గుంటూరు: హిమని సెంటర్లలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు



ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యేలు నరేంద్ర, మస్తాన్‌వలి, కనపర్తి, ప్రభాకర్, శేషయ్య ,మన్నవ తదితరులు



హిందూ కాలేజి సెంటర్‌లో రోడ్డు పై కూర్చుని నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'కలం పై దాడులా సిగ్గుసిగ్గు.. జర్నలిస్టులపై దాడులు హేయం..' అంటూ ప్రభుత్వ తీరుపై గుంటూరు జిల్లా జర్నలిస్టులు, అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ బుధవారం పాత్రికేయ సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంతో గుంటూరు నగరం దద్దరిల్లిపోయింది. వందల మంది విలేకరులు, అఖిలపక్ష నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కదంతొక్కారు. దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. రాప్తాడు 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపైన, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడులకు నిరసనగా బుధవారం గుంటూరులో ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పార్టీలు మద్దతు తెలియజేశాయి. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతోపాటు అన్ని పార్టీలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గుంటూరు కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెపారు. మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, దాడులను నిరసిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి నినాదాలు చేస్తూ హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఎస్పీ తుషార్‌దూడీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ప్రాణ రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు, సుఖవాసి శ్రీనివాసరావు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, ఫిరోజ్, కార్పొరేటర్లు ఈరంటి బాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, సోమేపల్లి శివప్రసాద్, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, షేక్ బాజీ, బ్రహ్మం, షేక్ సుభాని, గంటా పెద్దబ్బాయి, మౌలిక, వీ.గంగాదర్, జర్నలిస్టు సంఘాల నేతలు భక్తవత్సలరావు, ఐజేయూ గిరధర్‌కుమార్, ఫణీంద్రకుమార్, నరసింహారావు, పరస్యం నాయక్, ఆసిఫ్, నిమ్మరాజు చలపతిరావు, ఎస్ రవికుమార్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, స్టాఫ్ రిపోర్టర్లు మధుసూదనరావు, సతీష్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టరు సాంబశివరావు, ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజర్ ఎం.సుబ్బారావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సబ్ ఎడిటర్లు జీ.వెంకటేశ్వరరావు, సురేంద్ర, పరమేశ్వరరావు, వీరేష్‌కుమార్, బీ శ్రీనివాసరావు, జ్యోతి, లక్ష్మణ్, రిపోర్టర్లు, వివిధ విభాగాల సిబ్బంది పెద్దసంఖ్య లో పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లోనూ..

మీడియాపై రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడులపై ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజాసంఘాలు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో జర్నలిస్టులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛపై దాడి నశించాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెంలో కూడా నిరసన ర్యాలీలు జరిగాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, తుళ్లూరుల్లో అంబేద్కర్ బొమ్మల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు రథం సెంటర్‌లో జర్నలిస్టులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆనందబాబు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టం తీసుకురావాలి

విధి నిర్వహణలో భాగంగా సభలు, సమావేశాలను కవర్ చేసే విలేకరులపై దాడులు చేయడం అన్యాయం. దాడులకు బలైపోతున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. పార్టీలు, సంస్థలు ఏవైనా విబేధాలు ఉంటే వాటికి జర్నలిస్టులను బలి చేయవద్దు. ప్రాణాంత కంగా మారిన నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి.దాడులకు తెగించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్ఎన్ మీరా, ఏపీయూడబ్ల్యూజే

ప్రజలే బుద్ధి చెప్పాలి

విలేకరులపై దాడులు, దౌర్జన్యాలు దుర్మార్గం. అభ్యంతరం తెలపడానికి దాడులే మార్గమైతే, బూతులు తిట్టే మంత్రులను ఎన్నిసార్లు కొట్టాలి? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు రేపు ప్రజా కోర్టులో నుంచోవాలి. వారికి తగిన బుద్ధి ప్రజలే చెబుతారు. సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి.

- నిమ్మల శేషయ్య

దాడి అమానుషం

పత్రికా విలేకరులపై దాడి అమానుషం. పత్రికా స్వేచ్ఛను హరించే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటు. నిజాన్ని నిర్భయంగా చూపించే మీడియాపై దాడి సీఎం అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే. ఎన్నికల నేపథ్యంలో పథకం ప్రకారం దాడులు చేయిస్తున్నారు. విలేకరులకు క్షమాపణ చెప్పి, బాధితుడికి న్యాయం చేయాలి.

- దేగల ప్రభాకర్

దాడులకు జగన్ ప్రోత్సాహం

రాష్ట్రంలో ప్రజలను, ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కేందుకు సీఎం జగనే దాడులను ప్రోత్సహిస్తున్నారు. చేతులు మడతపెట్టాలని హింట్లు ఇచ్చి రెచ్చగొడుతున్నారు. వారి అవినీతి బాగోతాలు వెలికితీస్తున్న ఆంధ్రజ్యోతి,ఈనాడు సంస్థలపైనే దాడి చేయాలని సూచించినట్లు కనిపిస్తోంది. కొద్దిరోజుల్లో అధికారం మారుతుంది. దానికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు మీడియా సహా అందరూ ఏకమవ్వాలి.

- నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

వినాశకాలే విపరీతబుద్ధి

పోయేకాలం దాపురిస్తే ఇలానే చేస్తారు. వినాశకాలే విపరీతబుద్ధి. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని నాలుగేళ్ల క్రితమే చెప్పా. ఇక ఈ పాలనను తరిమికొట్టేందుకు సమయం వచ్చింది. అందరూ ఒక్కటై జగన్‌ను తరిమికొట్టాలి. - కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి

ప్రజాస్వామ్యం పరిహాసం

నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు చేయిస్తున్న జగన్ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. పాలనా వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్నా యన్న కోపంతోనే ఆంధ్రజ్యోతి, ఈనాడు లపై దాడులకు తెగిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి. - నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో పాశవిక పాలన

పత్రికా స్వేచ్ఛపై దాడి చేసే పాశవిక పాలన ఈ రాష్ట్రంలో అమలు జరుగుతోంది. మీడియా గొంతు నొక్కేస్తున్నారు. తన అవినీతి, అక్రమాలు కప్పి పుచ్చుకునేందుకే మీడియాపై దాడి చేస్తున్నారు. పాత్రికేయులపై దాడులు చేయడం మానుకోకపోతే ప్రత్యక్ష తిరుగుబాటు తప్పదు. దాడులు, దౌర్జనాలకు తెగిస్తున్న పాలకులను ఓడించాలి. - ముప్పాళ్ల నాగేశ్వరరావు , సీపీఐ

సీఎం క్షమాపణ చెప్పాలి

ప్రజలు, ప్రజాస్వామ్యంపై రాక్షసులు దాడులు చేస్తారనడానికి నిదర్శనమే రాప్తాడు, కర్నూలు ఘటనలు. ఈ ఘటనలపై సీఎం జగన్ మీడియాకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మీడియాపై దాడులు పరిపాటిగా మారాయి. నియంతృత్వ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు. బాధితుడికి సొంత ఖర్చుతో వైద్యం అందించాలి. - మస్తాన్‌వలి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రజాస్వామ్యంపై దాడి

విలేకర్లపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించే మీడియా మిత్రులను భయభ్రాంతులకు గురిచేయాలని సైకో ముఖ్యమంత్రి వారిపై దాడులకు పాల్పడేలా చేస్తున్నారు. దాడులు చేసిన మూకలను వెంటనే అరెస్టు చేయాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ప్రజలు ఇలాంటి సీఎంకి తగిన బుద్ధి చెప్పాలి.

- మొహమ్మద్ నసీర్ , టీడీపీ తూర్పు ఇన్‌చార్జి

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

రిపోర్టర్లపై దాడి హీనమైన చర్య. అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్నందునే అధికారపార్టీ మూకలను సీఎం దాడులకు పురిగొల్పుతున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి.

- మన్నవ మోహనకృష్ణ



రాజుపాలెం సెంటర్‌లో జర్నలిస్టులు నిరసన ర్యాలీ



పిడుగురాళ్లలో విలేకర్లపై దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, మిత్రపక్షాల నేతలు, పాత్రికేయులు



కలెక్టర్ శివశంకర్ లోతేటికి వినతి పత్రం అందజేస్తున్న వివిధ పార్టీల నాయకులు



పోలింగ్ కేంద్రాల్లో వసతుల పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, ఫిబ్రవరి 21: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను కల్పించామన్నారు. ఓటరు జాబితాల తుది ప్రచురణ అనంతరం కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, సవరణల కొరకు అందిన దరఖాస్తుల పరిష్కారం కూడా పూర్తైందన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ల వినియోగంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు, 40 శాతం పైబడిన శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగ ఓటర్లకు ఈసీ ఈ అవకాశం కల్పిందన్నారు. ఫాం-డీ ద్వారా ఈ అవకాశాన్ని పొందవచ్చుని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో అజయ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈకి ఏసీబీ షాక్

- రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
- రూ 55 వేలు లంచం సొమ్ము స్వాధీనం



అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీకే నష్టం

- 1527వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు, దీక్షలు

7లో..

బాలికలపై వలంటీరు వేధింపులు దారుణం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు
- వలంటీర్ల ఆకృత్యాలకు హద్దు లేదు.. : డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21: నరసరావుపేటకు సమీపంలోని పాలపాడులో బీసీ సామాజికవర్గానికి చెందిన ఇరువురు బాలికలను గత ఏడాది నుంచి వలంటీర్ వేధిస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. వలంటీరు పిట్టు శ్రీకాంత్‌రెడ్డిచే వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడి నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, ఆమె తల్లిదండ్రులను బుధవారం టీడీపీ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కనపర్తి మాట్లాడుతూ బాలిక మేనమామ, తండ్రి వెళ్లి అక్కడి వైసీపీ నాయకులను వేడుకున్నప్పటికీ మావాడు అంతే మీ పిల్లలను అదుపులో పెట్టుకోండని దూషించడం దారుణం అన్నారు. ప్రతిభ కలిన పెద్దమ్మాయికి ట్రిబుల్‌ఐటీలో సీటు వస్తే శ్రీకాంత్‌రెడ్డి పదేపదే ఫోన్లు చేసి, ఆ అమ్మాయిని అవమానపరిచాడన్నారు. అతని వేధింపు తట్టుకోలేక ఆ అమ్మాయి మధ్యలో చదువు మానేసి ఇంట్లోనే ఉంటుందన్నారు. ఒక బీసీ బాలిక ట్రిబుల్ ఐటీ సీటు వచ్చి వాలంటీర్ వేధింపుల కారణంగా చదువు మానుకుందంటే ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిగ్గుపడాలన్నారు. పెద్దమ్మాయి రావడం లేదని చిన్నామ్మాయిని వేధిస్తుంటే తట్టుకోలేక మంగళవారం ఎలుకల మందు తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఏమాత్రం మాన వత్వం ఉన్నా శ్రీకాంత్‌రెడ్డిని వెంటనే వలంటీర్ బాధ్యత నుంచి తొలగిం చాలని అన్నారు. బాలికకు పూర్తిగా ఉచిత వైద్యం అందజేయాలని, అవసర మైతే మెరుగైన వైద్యం కోసం గుంటూరు పంపించాలన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి,పత్తి నాగరాజు, కనికుంట్ల సాయి బాబు, లక్ష్మయ్యపఠాన్ అస్మతుల్లా పాల్గొన్నారు.



బాలికను పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు

కఠినంగా శిక్షించాలి..

వలంటీర్ల అకృత్యాలు రాష్ట్రంలో ఏదో ఒకచోట నిత్యం జరుగుతూనే ఉన్నాయని, బలహీన వర్గాల మహిళలే వారి అకృత్యాలకు బలి అవుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బాలికను పరామర్శించిన అనంతరం అరవిందబాబు మాట్లాడుతూ మీరు ఎవరికి చెప్పినా ఏమీ చేయలేరని మా ప్రభుత్వం ఉన్నంతకాలం మేము ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని వలంటీరు అహంకార ధోరణితో మాట్లాడడం దారుణం అన్నారు. శ్రీకాంత్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని, దిశ, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి మద్యం, గంజాయి మత్తులో బాలికలను వేధిస్తున్నాడని, అతనిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు చెన్నుపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ లైంగికంగా వేధించిన వలంటీర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడియాల తాండవ కృష్ణ, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, సీతారామాంజనేయులు, చక్రపాణి, సురేష్, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, రఫీ, బాలు, వీరప్పయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

25న ఎయిమ్స్ జాతికి అంకితం

- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21: మంగళగిరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 25న వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. 183.11 ఎకరాల విస్తీర్ణంలో ఎయిమ్స్ నిర్మాణం జరిగింది. 960 పడకల ఆస్పత్రి, 125 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల కోసం కేంద్రం రూ.1,618.23 కోట్లు ఖర్చు చేసింది. ఎయిమ్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఇందుకోసం ఎయిమ్స్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టరు ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు జే.నివాస్, ఎస్పీ తుషార్‌దూడీతో కలిసి బుధవారం పరిశీలించారు. గవర్నరు, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నివాస్

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ హైదరాబాద్‌లో స్యూర్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఎక్స్‌ప్లోజర్(స్యూర్)' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి కనిష్ఠంగా ఒక నెల, గరిష్ఠంగా రెండు నెలలు ఉంటుంది. అభ్యర్థులు ఫుల్ టైమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్/ఆన్‌లైన్ విధానాలు లేవు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లను అమ్మాయిలకు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా ఉచితం. స్టయిపెండ్ కూడా ఇస్తారు. ఎంపికైనవారికి ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారు. అభ్యర్థులు మెస్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బేసిక్ మెడికల్ సర్వీస్ అందిస్తారు.

విభాగాలు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సస్టయినబిలిటీ, క్లయిమేట్ ఛేంజ్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్, ఫిజిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన పరిశోధనాంశాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత

ఎమ్మెస్సీ(మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ)/ఎంఏ మొదటి ఏడాది చదువుతున్నవారు; బీటెక్(అన్ని విభాగాలు)/బీడిజైన్‌కు సంబంధించి రెండో ఏడాది/మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి మూడో ఏడాది/నాలుగో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో అభ్యర్థులు నిర్దేశిత సీజీపీఏ స్కోర్‌లో టాప్ 20 శాతం సాధించి ఉండాలి. ఫుల్ టైమ్/రెగ్యులర్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌నకు అనర్హులుగా ప్రకటించారు.

ఎంపిక

ప్రిలిమినరీ స్ర్కీనింగ్ ద్వారా సెలెక్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.



స్టయిపెండ్

అభ్యర్థులు ఒక నెల, నెలన్నర, రెండు నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. నెల ప్రోగ్రామ్‌నకు రూ. 7,500; నెలన్నర ప్రోగ్రామ్‌నకు రూ.10,000; రెండు నెలల ప్రోగ్రామ్‌నకు రూ.15,000లను స్టయిపెండ్ కింద చెల్లిస్తారు.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** 2024 మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** iith.ac.in, https://iith.ac.in/research/SURE/

ఏపీ పాలిసెట్

ఆంధ్రప్రదేశ్-మంగళగిరిలోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- 'పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు

మూడేళ్ల కోర్సులు: సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3డీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్కింగ్, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అప్పారెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.

మూడున్నరేళ్ల కోర్సులు: బయో మెడికల్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్/షుగర్ టెక్నాలజీ), సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ పాలిసెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఏపీ స్టేట్ బోర్డు రూపొందించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్‌ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **ఏపీ పాలిసెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 27
- **ఫలితాలు విడుదల:** మే 13
- **వెబ్‌సైట్:** polycetap.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2N5NZ6nలో చదవండి.



సన్నిహితుల సమక్షంలో రకుల్ వివాహం

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల మిత్రుడు, నిర్మాత జాకీ భగ్నానీతో ఆమె వివాహం గోవాలోని ఐటీసీ గ్రాండ్ రిసార్ట్స్‌లో బుధవారం జరిగింది. ఉదయం సిఖ్ పద్ధతి ప్రకారం, సాయంత్రం సింధి సంప్రదాయ పద్ధతిలో జరిగిన వీరి వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్‌కుమార్, వరుణ్ ధావన్, జెనీలియా, టైగర్ ష్రాఫ్, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా తదితరులు హాజరయ్యారు.



'బినాకా గీత్ మాలా' అమీన్ సయానీ ఇక లేరు!



'బెహనో ఔర్ భాయియో' అంటూ 42 ఏళ్ల పాటు సిలోన్ రేడియోలో, ఆ తర్వాత వివిధ భారతిలోనూ 'బినాకా గీత్ మాలా' కార్యక్రమంతో హిందీ సినీ గీతాల మాలతో శ్రోతలను అలరించిన స్వరం మూగబోయింది. రేడియో అనౌన్సర్లకు, జాకీలకు పితామహుడు లాంటి అమీన్ సయానీ తన 91 ఏట గుండెపోటుతో బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన సమర్పించే 'బినాకా గీత్ మాలా' వినడం కోసం ఆ రోజుల్లో ప్రతి బుధవారం అంతా రేడియో ముందు చేరిపోయేవారు. ఈ కార్యక్రమంలో ప్రసారం చేసే పాట గురించి మధ్య మధ్యలో ఆయన చేసే వివరణ చాలా ఆసక్తికరంగా ఉండేది. 'బినాకా గీత్ మాలా' మాత్రమే కాకుండా క్విజ్ ప్రోగ్రామ్, షాలీమార్ సూపర్ జోడీ, 'సంగీత్ కే సితారే' వంటి కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. 54 వేల రేడియో కార్యక్రమాలు నిర్వహించిన రికార్డ్ సృష్టించిన అమీన్ సయానీ 2009లో పద్మశ్రీ పురస్కారం పొందారు. ఇప్పటివరకూ పద్మశ్రీ పురస్కారం పొందిన రేడియో అనౌన్సర్ అమీన్ సయానీ మాత్రమే. అలాగే 'భూత్ బంగ్లా', 'బాక్సర్', 'ఖతాల్' వంటి చిత్రాల్లో అమీన్ నటించి, అనౌన్సర్ పాత్రలనే పోషించడం విశేషం.

వేడుకగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల ప్రదానం



భారతీయ సినీరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 మంగళవారం రాత్రి ముంబైలో కన్నుల పండుగగా జరిగింది. పలువురు సినీతారలు ఈ చిత్రోత్సవంలో సందడి చేశారు. 'యానిమల్' చిత్రానికి గాను సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ నటీనటులుగా 'జవాన్' చిత్రానికి షారూఖ్, నయనతార అవార్డు స్వీకరించారు. ఉత్తమ ప్రతినాయకుడిగా బాబీడియోల్, ఉత్తమ సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ నిలిచారు. సంగీత ప్రపంచానికి అందించిన సేవలకు గాను యేసుదాస్ ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షారూఖ్‌ఖాన్ మాట్లాడుతూ 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అంటే నాకు చాలా గౌరవం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఉత్తమ నటుడి పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవార్డును నాతో పాటు పురస్కారాలకు నామినేట్ అయిన తోటి నటీనటులకు అంకితమిస్తున్నాను. ఇంత గొప్ప గౌరవం దక్కేలా చేసినందుకు ప్రేక్షకులకూ, జవాన్ చిత్రబృందానికి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

సూర్య కెరీర్‌లోనే హై బడ్జెట్ ఫిల్మ్



విభిన్న పాత్రలను పోషించడంలో ఎప్పుడూ ముందుండే తమిళ హీరో సూర్య ప్రస్తుతం పాన్ వరల్డ్ ఫిల్మ్ 'కంగువ'లో నటిస్తున్నారు. మొత్తం పది భాషల్లో విడుదల కానున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌కు శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దిశా పటాని కథానాయిక. ఈ సినిమా డబ్బింగ్ వర్క్ ప్రారంభించారు సూర్య. ఆయన కెరీర్‌లోని హై బడ్జెట్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. త్రీడీలోనూ 'కంగువ' విడుదల కానుంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EsKRWQ0 లో చదవండి.



నిరుపయోగంగా ఉన్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి ఉపయోగించే యంత్రాలను చూపిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

జగన్‌లాంటి దుర్మార్గులను తరిమేయాలి

- శిథిలమౌతున్న రూ. కోట్ల విలువచేసే యంత్ర సామగ్రి
- మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి21: వందల కోట్ల రూపాయలు విలువచేసే యాంత్రాలను మట్టిపాలు చేసిన ఈ సీఎం జగన్‌లాంటి వారిని తరిమేయాలని టీడీపీ జనసేన పార్టీల సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపంలోవున్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానం నిమిత్తం ఉపయోగించే యాంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ 2014-19 మధ్య ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో గోదావరి-పెన్నా అనుసంధానం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం రూ.6 వేల కోట్లు మంజూరు చేసి పని కూడా ప్రారంభించారని తెలిపారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి రావడం, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావటంతో ఈ ప్రాజెక్టు మరుగున పడిపోయిందన్నారు. అప్పటి నుంచి వందల కోట్ల రూపాయల విలువ చేసే భారీ యంత్రసామగ్రి నిరుపయోగంగా మారిందని, ప్రజల తాగు, సాగు నీటి కష్టాలు తీర్చే ప్రాజెక్టు పని కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకర స్థాయిలో శాంతి భద్రతలు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి21: ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన సీఎం జగన్‌రెడ్డి పాలనలో కొన్ని రోజులుగా శాంతి భద్రతలు మరింత ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళనవ్యక్తంచేశారు. బుధవారం చిలకలూరిపేట గోల్డ్‌బజారులో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రత్తిపాటి, జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్‌లు పాల్గొని టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సూపర్ 6 సంక్షేమ పథకాల గురించి స్థానిక బంగారు వర్తకులకు, ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆర్యవైశ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల చంద్రబాబు రాజకీయ అనుభవంతో ఈ సూపర్ - 6 హామీలకు రూపకల్పన చేశారని అన్నారు. కొన్ని రోజులుగా ప్రతిపక్షాలు, పత్రికలు లక్ష్యంగా చేసుకొని పెరిగిన వైసీపీ దాడులు అత్యంత హేయం అన్నారు. నిజాలను చూపిస్తుంటే జీర్ణించుకోలేక వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే తట్టుకోలేక ఇలా దౌర్జన్యాలకు దిగుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి పోకడలకు తావు లేదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాగానే గాడి తప్పిన శాంతి భద్రతలను చక్కదిద్దుతామని, జగన్ ప్రభుత్వ అండ చూసుకొని ఇప్పుడు ఇలా అరాచకాలకు పాల్పడుతున్న వారందరిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జనసేన నేత తోట రాజా రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్, చంద్రబాబుల నేతృత్వంలో జనసేన, తెలుగుదేశం కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.

విలేకరులపై దాడులు హేయం

- చొక్కామడతపెట్టడమంటే దాడులు చేయమనా..!
- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: సిద్ధం సభలో జగన్‌మోహన్‌రెడ్డి చొక్కా మడతపెట్టమనడం అంటే ప్రజలకు సమాజపోకడలను నిర్భయంగా తెలిపే విలేకరులపై దాడులు చేసి చావబాదటమేనా అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని మారీసుపేట పెండ్యాల వెంకట్రావు కల్యాణమండపంలో బుధవారం బీసీ సంఘనేతలతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి దాడుల సంస్కృతికి తెరలేపారని ఆరోపించారు. అది పెరిగి పెరిగి చివరకు పత్రికా విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు పురమాయిస్తున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి తన పదవీకాలంలో దోచుకోవడం, దాచుకోవడం, ప్రశ్నించిన వారిపై దాడులుచేయడం లేదా అక్రమకేసులు పెట్టి నోరు మూయించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. జగన్ సిద్ధం సభకు వచ్చిన విలేకరులు, ఫొటోగ్రాపర్లపై వైసీపీ మూక దాడిచేసి, చిత్రహింసలు పెడుతుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఎందుకు కాపాడలేకపోయారని ప్రశ్నించారు. చివరికి ఆ మూకల నుండి పోలీసులు గాయపడిన విలేకరులను ఆసుపత్రికి తరలించకుండా పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు.సామాజిక న్యాయం, పత్రికా స్వేచ్ఛకు ఈ ప్రభుత్వంలో భద్రత ఎక్కడుందో ప్రజలందరూ ఆలోచించాలన్నారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికల స్వేచ్ఛపై దాడి చేయడం వైసీపీ నిచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రజలకు మంచి చేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పాసింది పోయి దాడులను ప్రోత్సహిస్తున్న తీరు చేస్తుంటే యువతరం ఏమైపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపిస్తున్న పత్రిక యాజమాన్యాన్ని కూడా వదిలిపెట్టని పరిస్థితికి జగన్ దిగజారడం చూస్తుంటే ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు ఆయన ఇచ్చే విలువేంటో తేటతెల్లమైందన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ చెబుతూనే వారిపై చేస్తున్న అరాచకాలు, నిరంకుశ పాలన వంటి అంశాలను వెలుగులోకి తెస్తున్నారన్న అక్కసుతో ఇటువంటి వాటికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ నాడు జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పత్రికా స్వేచ్ఛ హరించే 930వ జీవోను తీసుకువస్తే అపట్లో జరిగిన ఆందోళనలకు వెనక్కి తీసుకున్నారని నేడు మళ్ళీ కొడుకుగా జగన్ ఆజీవోని తీసుకువచ్చారన్నారు. సిద్ధం సభలో సీఎం జగన్‌రెడ్డి చొక్కా చేతులు మడవండి అంటే తమకు వ్యతిరేకంగా ఎవరున్నా వారిని చావ బాదమని చెబుతూ వారి పార్టీ శ్రేణులకు ఉసి గొల్పటమేనా అని ప్రశ్నిచారు. విలేకరులపై దాడులు చేసిన మూకలను పోలీసులు మూడు రోజులకు గాను ఒక్కడిని మాత్రమే పట్టుకుని అరెస్ట్ చేసి నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తక్షణమే దాడులకు పాల్పడిన నిందితులను పట్టుకుని మరో మారు ఇటువంటి ఘటనలకు తావు లేకుండా కఠిన శిక్షలు విధించాలని ఆలపాటి డిమాండ్ చేశారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, గిరి గణేష్, ఫణిదపు దుర్గ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం

- టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 21: తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్యాయత్నం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని విమర్శించారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న మర్రెడిపై జరిగిన దాడి అమానుషమని అన్నారు. వ్యక్తిగత కక్షతో తనను హతమార్చేందుకు కిరాతకంగా పథకం ప్రకారం దాడి చేశారన్నారు. జేమ్స్ ఆసుపత్రి యజమాని రామచంద్రారెడ్డి వెనుక వైసీపీ నాయకుల ప్రోత్సాహం, కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. అదేవిధంగా కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ దుండగుల దాడి అత్యంత హేయనీయమైన చర్య అని అన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ఎమ్మెల్యే బొల్లా జన్మదిన వేడుకలు జరుపుకుంటూ టీడీపీ బ్యానర్లు చించివేయించడం, ధ్వంసం చేయించి అల్లర్లను రెచ్చగొడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు కూడా ధ్వంసం చేయించడం దుర్మార్గమన్నారు. ఆసుపత్రి నిర్మించకుండానే బొల్లా బ్రహ్మనాయుడు 100 పడకల ఆసుపత్రిని నిర్మించామని ఉదరగొట్టడం హాస్యాస్పదమన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం చేసే ఆలోచన వైసీపీకి లేదని, జీవో ఇచ్చి నిధులు కేటాయించిన టీడీపీతోనే వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెమ్మసాని నాగేశ్వరరావు, షమీమ్ ఖాన్, ముంద్రు సుబ్బారావు, మద్దుల వెంకటేశ్వరరెడ్డి, పత్తిపూర్ణ, మాదాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి విక్రేతను అరెస్టు చూపిస్తున్న సీఐ కోటేశ్వరరావు

గంజాయి విక్రేత అరెస్టు

- 1 కిలో సరుకు స్వాధీనం.. ఆటో సీజ్

చేబ్రోలు, ఫిబ్రవరి21: గంజాయి తాగడంతోపాటు విక్రయాలకు పాల్పడుతున్న ఒరిస్సాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు, వివరాలను సీఐ వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిని గురుశెట్టి అనే వ్యక్తి రెండేళ్ల క్రితం కుటుంబంతో సహా బదుకుతెరువు కోసం చేబ్రోలు వచ్చి స్పినింగ్ మిల్‌లో పనిచేస్తున్నాడు. గురిశెట్టికి సోమనాథ్ అనే వ్యక్తి పరిచయం కాగా ఇద్దరు గంజాయికి బానిసలయ్యారు. వారం రోజుల క్రితం పలాసకు చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి సోమనాధ్‌కు ఒక కిలో గంజాని తీసుకొచ్చి ఇచ్చాడు. ఈ నెల 20న గురుశెట్టి ఆ గంజాయిని అమ్మటానికి ఆటోలో వెళ్లతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన చేబ్రోలు పీఎస్ ఎస్ఐ పీ.మహేష్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

పెంపుడు కొడుకు చేతిలో తండ్రి హతం

- కత్తితో నరికి చంపిన కసాయి
- తల్లికి తీవ్ర గాయాలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21: ఆస్తి కోసం పెంపుడు తండ్రిని నరికి చంపిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన యోహాను(79), చిట్టెమ్మ భార్యాభర్తలు. యోహాను గతంలో ప్రభుత్వ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. వారికి సంతానం లేకపోవడంతో అన్న కుమారులైన అంబేద్కర్, బాబులను చిన్నతనం నుంచే పెంచుకున్నారు. అంబేద్కర్ సుమారు 40 కేసుల్లో ముద్దాయి కాగా రెండేళ్లు జైలు జీవితం గడిపి ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. ఆ సమయంలో యోహానుకు పక్షవాతంరాగా తమ్ముడు బాబు సపర్యలు చేశాడు జైలు నుంచి వచ్చిన అంబేద్కర్ తనకు దక్కాల్సిన ఆస్తిని యోహాను.. బాబుకు కట్టపెడతాడనే అనుమానం పెంచుకున్నాడు. ఈ విష యమై కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు రాగా కుటుంబ సభ్యులు, పెద్దలు కూర్చొని ఆస్తిపంపకాలు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అయినా గొడవలు సద్దుమణగ లేదు. ఈక్రమంలో బుధవారం అంబేద్కర్ తన వెంటతెచ్చుకున్న కొబ్బరిబొండాల కత్తితో ఇంట్లోవున్న యోహాను ముఖంపై, మెడపై నరికాడు. యోహాను భయంతో వీధిలోకి పరిగెత్తాడు. అయినా వదలకుండా వీధిలోనే కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డొచ్చిన యోహాను భార్య చిట్టెమ్మను గాయపరచడంతో ఆమె స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, డీఎస్పీ పల్లంరాజు, ఎస్ఐ రబ్బాని, అమీర్‌లు ఘటనా స్థలా నికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ ఏఈకి ఏసీబీ షాక్ !

- రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
- రూ 55 వేలు లంచం సొమ్ము స్వాధీనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 : చిలకలూరిపేట విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఆర్.ప్రకాశరావునాయక్ బుధవారం తన కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన గడిపూడి అనీల్‌కుమార్ వ్యవసాయ విద్యుత్ సర్వీస్ మీటరు కోసం ప్రకాశరావు నాయక్ చుట్టూ గత కొంత కాలంగా తిరుగుతున్నాడు. ఇందుకు ప్రకాశరావు నాయక్ రూ.70వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్‌చేశాడు. లంచం ఇవ్వటం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి ఏఈపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రూ.55వేలు లంచం తీసుకుంటుండగా ఏఈ ప్రకాశరావునాయక్‌ను ఆయన కార్యాలయంలోనే పట్టుకున్నారు. ఏఈని అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపెడతామని అధికారులు తెలిపారు. ఏసీబీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తె, డీఎస్పీలు సత్యానందం, ప్రతాప్‌కుమార్, ఆరుగురు సీఐలు తదితర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. అధికారులు లంచం అడిగితే 14400 నెంబరుకు ఫిర్యాదు చేయాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లాది విష్ణు, లక్ష్మీపార్వతి, వీసీ రాజశేఖర్

తెలుగు భాషను కాపాడుకుందాం

- ఏఎన్‌యూలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 21: దేశాభివృద్ధి ఆయా భాషా సంస్కృతులపై ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ అన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీలు సంయుక్తంగా బుధవారం విశ్వవిద్యాలయంలోని వేణు గోపాల్‌రెడ్డి సెమినార్ హాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ హాజరై తెలుగుభాషా ఔన్నత్యాన్ని వివరించారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ తెలుగు సంస్కృత భాషలు ఎంతో గొప్పవని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సంస్కృత భాషలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తెలుగు సంస్కృత భాష అకాడమీ ఛైర్మన్‌డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సంస్కృత భాషల అభివృద్ధికి సీఎం తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు విశ్వవిద్యాలయం అందిస్తున్న తోడ్పాటు పట్ల ఉపకులపతి రాజశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సంచాలకులు వీ.రామకృష్ణ, విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం భాషా పండితులకు సన్మానం చేశారు.

మళ్లీ క్రైస్తవులను మోసం చేసేందుకు జగన్ పన్నాగం

- టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో క్రైస్తవులను మరోసారి మోసం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తెరలేపారని తెలుగుదేశం పార్టీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు విమర్శించారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 75వేల మంది పాస్టర్లు ఉంటే కేవలం పది శాతం మందికే గౌరవ వేతనాలు ఇస్తూ మిగిలిన వారిని నిలువునా మోసం చేస్తున్నారని అన్నారు. చర్చిలు, శ్మశానవాటికలు, క్రైస్తవ కాలనీలు ఎన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి చర్చి నిర్మాణానికి రూ.5 లక్షలు ఫండ్ ఇస్తానని చెప్పి క్రైస్తవుల ఓట్లను దండుకున్నారని అన్నారు. బ్రదర్ అనిల్ రాష్ట్రంలోని పాస్టర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి మేనిఫెస్టో చూపించి జగన్‌ను గెలిపిస్తే క్రైస్తవులకు మంచి రోజులు వస్తాయని చెప్పారన్నారు. క్రైస్తవుల ఓట్లతో గెలుపొంది గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఏ ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకుండా నిలువునా మోసం చేశారని ఆయన వాపోయారు. ఇప్పుడు విమలారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులకు మోసపూరిత హామీలు ఇస్తున్నారని, క్రైస్తవులపై దాడులు జరిగినప్పుడు, ఆస్తులు ఆక్రమించినప్పుడు వీరంతా ఏమయ్యారో సమాధానం చెప్పాలన్నారు. గత టీడీపీప్రభుత్వ హయాంలో 277 చర్చిలు నిర్మించామని, వైసీపీ ప్రభుత్వంలో ఒక్క చర్చి అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో క్రిష్టియన్ నేతలు శ్యామ్, ఇనగంటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వీఈఐటీలో విద్యార్థులతో సినీ హీరో వరుణ్ తేజ్

వీవీఐటీలో వరుణ్ తేజ్ సందడి

పెదకాకాని, ఫిబ్రవరి 21 : సినీ హీరో వరుణ్ తేజ్ వీవీఐటీ కళాశాలలో బుధవారం సందడిచేశారు. ఆయన నూతనంగా నటించిన ఆపరేషన్ వాలంటైన్ చిత్రం మార్చి 1న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా ఆయన వీవీఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ తేజ్ మాట్లడుతూ దేశభక్తి మనలో అంతర్లీనంగా ఉంటుందని, ఈ చిత్రం దేశభక్తి చిత్రం అని అన్నారు. ఇటువంటి చిత్రం ద్వారా మీముందుకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈచిత్రం ద్వారా జవాన్ల త్యాగాలు వారి ధైర్య సాహసాలను మీముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ చిత్రం చూసిన అనంతరం భారతీయులుగా పుట్టినందుకు గర్వంగా బయటికి వస్తారని అన్నారు. ప్రేక్షకులకు నిరంతరం కొత్తదనం అందించే ప్రయత్నం చేస్తుంటానని అన్నారు. అనంతరం విద్యార్థులు సెల్ఫీలతో సందడి చేశారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు , రైతులు

అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీకే నష్టం

- 1527వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు, దీక్షలు

తుళ్లూరు, ఫిబ్రవరి 21: రాజధాని అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీ పాలకులకే నష్టమని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1527వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఐదు కోట్లమంది కోరుకునే రాజధాని అమరావతి విధ్వంసం తగదని సీఎం జగన్‌రెడ్డికి హితవు పలికారు. ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్‌రెడ్డి, అదే కేంద్రం ముందు మోకరిల్లారని ఆరోపించారు. సీఎంకి దమ్ముంటే విభజన చట్టంలో హామీలను అమలు పరిచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానులు కావాలని రాష్ట్రంలో ఏ ఒక్కరూ అడగలేదన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా మూడు ఎలా పెడతారని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల ప్రతిపాదన తేవటానికి సీఎం జగన్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. అందుకు వంత పాడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు ,మంత్రులకు అంత కన్నా సిగ్గు లేదని విమర్శించారు. అమరావతి వెలుగు కార్యక్రమలో భాగంగా రైతులు దీపాలు వెలిగించి నినాదాలుచేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



ఆరుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లజత

ఆరుపళ్ల విభాగంలో కాకుమాను ఎడ్లజత విజేత

మాచవరం, ఫిబ్రవరి21: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి 58వ కల్యాణమహోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఆరుపళ్ల విభాగంలో గుంటూరు జిల్లా కాకుమాను మండలం, కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితచౌదరి ఎడ్లు 5,200 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షిత చౌదరి కంబైన్డ్ ఎడ్లజత 4,800 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన పోతిన లక్షిత్ చౌదరి ఎడ్లు 4533.10 అడుగుల దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచాయి.

నాలుగుపళ్ల విభాగంలో..

నాలుగుపళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సరిపూడి గ్రామానికి చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పొలడుగు గ్రామానికి చెందిన శాఖమూరి విజయ్‌పవన్‌కుమార్ కంబైన్డ్ ఎడ్లజత 5,000 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికిచెందిన దండు అప్పారావు, బాపట్ల జిల్లా బల్లికురువ మండలం గంగపాలెం గ్రామానికిచెందిన రాయుడు సుబ్బారావు కంబైన్డ్ ఎడ్ల జత 4680.5 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన కపులూరి హుస్సేన్ ఎడ్లజత 4658.10 అడుగుల దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచాయి. సూరప నేని రాధాకృష్ణ, దుగ్గి శ్రీనివాసరావులు న్యాయ నిర్ణేత లుగా వ్యవహరిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తిని గొంతుకోసి హత్య

దాచేపల్లి, ఫిబ్రవరి 21: గుర్తుతెలియని వ్యక్తిని గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొందుగల గ్రామంవద్ద రాష్ట్ర రవాణాశాఖ చెక్‌పోస్టు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి వుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారిం చగా మృతుడు 40నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగివున్నాడని, మెడవద్ద కత్తితో కోసినట్లు గాయం ఉన్నట్లు తెలిపారు. అతను ధరిం చిన దుస్తులను బట్టి లారీ డ్రైవర్‌గా భావిస్తున్నారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

1,35,644 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,39,400 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,35,644 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,09,411 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20700
నెంబరు. 5	13000	19000
273	12500	16500
341	12000	20000
4884	13700	17500
సూపర్ 10	16200	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	12000	20000
తెల్లకాయలు	5000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను అందజేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

వైసీపీ హయాంలో రాజ్యమేలుతున్న అరాచకం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో వైసీపీ పాలన ఏర్పడ్డాక అరాచకమే రాజ్యమేలుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో యరపతినేని పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలకు మేలు కలుగుతుందే తప్ప వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగదన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామాన్ని టీడీపీ హయాంలోనే తగినంత అభివృద్ధి చూపించామన్నారు. వైసీపీ పాలనలో కులమతాలను, కొందరు వ్యక్తులనే ఎంచుకొని పథకాలు అందిస్తున్నారని, అర్హులైన వారికి ఏ పథకాన్ని వర్తింప చేయడం లేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కలిగే ప్రయోజనాలైన మహాశక్తి, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం, అన్నదాత, బీసీల రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు పథకాల గురించి యరపతినేని వివరించి భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను అందజేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు, మహిళలు యరపతినేనికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యక్కల సుబ్బారావు, గండికోట వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, శివ, అనిల్, మురళీ, సాదం హనుమయ్య, తెలుగు మహిళలు నెల్లూరి నాగేంద్రం, పర్చూరి వెంకటరమణ, పాదర్తి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీవో



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తదితరులు

మాచవరం, ఫిబ్రవరి 21: మండలంలోని రేగులగడ్డ గ్రామంలో బుధవారం పోలింగ్ బూత్‌ను గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి పరిశీలించారు. రేగులగడ్డ గ్రామాన్ని పులిచింతల ముంపు ప్రాజెక్టులో పూర్తిగా తీసుకున్నారు. అక్కడి గ్రామస్తులు ముంపునకు పైభాగంలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. అయితే పోలింగ్ కేంద్రం పాత గ్రామంలో వుండటం వల్ల కొత్తగా నిర్మించుకున్న గ్రామానికి దూరంలో వుండటంతో గ్రామస్తుల కోరిక మేరకు ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కొత్తగా నిర్మించుకున్న గ్రామంలో కొత్త పాఠశాల నిర్మాణం చేపట్టారని, ఆ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి పోలింగ్ కేంద్రాన్ని కొత్త గ్రామంలోకి మార్చేందుకు ప్రయత్నం చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, విఆర్‌ఓ అఖిల్ తదితరులున్నారు.

రాజధాని ఫైల్స్ సినిమా ఉచిత ప్రదర్శన

మాచవరం, ఫిబ్రవరి 21 : మాచవరంలోని రాఘవేంద్ర సినిమా థియేటర్‌లో రాజధాని ఫైల్స్ సినిమా బుధవారం నుంచి ఉచితంగా ప్రదర్శించడం జరుగుతుందని మండల టీడీపీ నాయకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ చిత్ర ప్రదర్శన వారం రోజుల పాటు ఉచితంగా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ కార్యవర్గ సభ్యులు యడ్ల పల్లి రామారావు, మాజీ ఎంపీటీసీ చల్లాపల్లి నరసింహారావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాశిమళ్ల శౌరిబాబు, తెలుగుయువత అధ్యక్షుడు షేక్ హసన్‌వలి, మాజీ సర్పంచ్ మాబువలి వద్ద ఈ చిత్రానికి సంబంధించి ఉచిత టిక్కెట్లు తీసుకోవాలని తెలియజేశారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీకి యత్నం

రెంటచింతల, ఫిబ్రవరి 21 : మండలంలోని మంచికల్లులో గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో హుండీని పగులకొట్టడానికి గుర్తు తెలియని దుండగులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వెండి వెంకటేశ్వర్లు బడ్డీ కొట్టులో రూ.3 వేల నగదుతోపాటు సిగరెట్ ప్యాకెట్లు అపహరించారు. మరొకరి చిల్లర దుకాణంలో చోరీకి యత్నించారు.

విలేకర్లపై దాడులను నిరసిస్తూ భారీ ర్యాలీ

● సంఘీభావం తెలిపిన టీడీపీ, జనసేన, మిత్రపక్షాలు



తహసీల్దార్ శ్యాంసుందరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు, మిత్రపక్షాల నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక పత్రికలపై, పాత్రికేయులపై, కార్యాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం పిడుగురాళ్లలో పాత్రికేయుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలు, పత్రికా వ్యవస్థలపై దాడులను తీవ్రంగా పరిగణించాలని, పత్రికా స్వేచ్ఛ కల్పించాలని, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో ప్రశ్నిస్తే కేసులు, దాడులు చేయడం సాంప్రదాయంగా మారడం సిగ్గుచేటన్నారు. గురజాల నియోజకవర్గంలో యరపతినేని శ్రీనివాసరావు ఎల్లప్పుడూ పాత్రికేయుల సంక్షేమానికి మద్దతుగా వుంటారని, వారి సంక్షేమానికి సంక్షేమ నిధి కింద రూ.5 లక్షలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ రేపటి ఎన్నికల తరువాత పాత్రికేయుల సంక్షేమ నిధిని రూ.25 లక్షల వరకు పెంచుతూ ప్రతి పాత్రికేయుని కుటుంబానికి ఆపద సమయంలో ఆదుకునేలా వుంటామని నిఖిల్ వివరించారు. ర్యాలీలో పాల్గొన్న టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), పలువురు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ పాత్రికేయులపై దాడులు జరుగుతున్నా సీఎం జగన్ నోరుమెదపకపోవడం ఏమిటన్నారు. ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఆర్ అండ్‌బి బంగ్లా నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్లేకార్డులు చేతబూని ఐలాండ్ సెంటర్ వరకు వెళ్లి నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం తహసీల్దార్ శ్యాంసుందరరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్‌అలి, తురకా వీరస్వామి, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, కనిగిరి శ్రీను, కొక్కెర కొండలు, పణితి రవి, పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సాంబశివరావు, జొన్నలగడ్డ శ్రీను, ముప్పాళ్ల సాంబయ్య, బొల్లా శ్రీను, వల్లెపు రామకృష్ణ, నీరుమళ్ల శ్రీను, సైదా, కుంచపు నాగలింగేశ్వరరావు, మల్లంశెట్టి లక్ష్మణరావు, చల్లగుండ్ల శ్రీను, పాటిబండ్ల శ్రీహరి, చింతల అజయ్, జమ్మిశెట్టి రామకృష్ణ, పాత్రికేయులు గోళ్ల నెమిలిరెడ్డి, గుత్తా పేరయ్య, కొమ్మా మహేష్, కొత్తపల్లి రమేష్, రామిశెట్టి మధు, ఈటీవి చారి, గుదె నరసింహారావు, భాష రవీంద్ర, రంజాన్‌వలి, కరిముల్లా, పల్నాడు సైదా, ఏసుబాబు, మరికొందరు పాత్రికేయులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం,ఫిబ్రవరి21:జర్నలిస్టులపై దాడులను ఖండించాలని... మీడియా స్వేచ్చను కాపాడాలనే నినాదాలతో రాజుపాలెం గ్రామంలో జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. గుంటూరు-మాచర్ల రహదారిపై రాజుపాలెం బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా విలేకరులపై దాడులను ఖండించాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మీడియా సభ్యులు నినాదాలు చేశారు. అనంతరం వారు తమ డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఆర్డీవో మురళీకృష్ణ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పొత్తూరు నాగరాజు, రామిశెట్టి శ్రీను, గరికపాటి శంకరరావు, మహేష్, చేవుల మస్తాన్ రావు, ప్రేమ్‌దాస్, నాగార్జునరెడ్డి, సూర్యం, బాబురావు, రాఘవ తదితరులు ఉన్నారు.

మాచవరంలో...

మాచవరం, ఫిబ్రవరి 21: ఇటీవల పలు పత్రికా విలేకర్లపై వైసీపీ మూకల దాడులను ఖండిస్తూ బుధవారం మాచవరంలోని పలు పత్రికలకు చెందిన విలేకర్లు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రామకృష్ణకు అందజేశారు. ఈనెల 14న అమరావతిలో అక్రమ ఇసుక రవాణాపై న్యూస్ కవర్‌చేసేందుకు వెళ్లిన ఈనాడు విలేకరి పరమేశ్వరరావుపై దాడి చేయడం, 18వ తేదీన రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఫొటోలు కవర్ చేస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గుండాలు మూకుమ్మ డిగా దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టడం ఖండించదగ్గ విషయమని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గుదె వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి శేషగిరిరావు, మద్దు కోటేశ్వరరావు, ఎలిశెట్టి నాగేశ్వరరావు, జాఫర్, షేక్ సైదా, యారాసి రాంబాబు, తదితరులున్నారు.



మాచవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పలు పత్రికల విలేకరులు

డ్రైవింగ్ సమయంలో కుటుంబీకులను గుర్తుంచుకోవాలి

రెంటచింతల, ఫిబ్రవరి 21 : డ్రైవింగ్ సమయంలో కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు కోరారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఫ్యాక్టరీ ఆవరణలో భద్ర తా జెండాను ఆవిష్కరించి వందలాది మంది కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎ.రామకృష్ణారెడ్డి, సీనియర్ డిప్యూటీ మేనేజర్ ఎ.వెంకట్రావ్, డిప్యూటీ మేనేజర్ జి.మల్లిఖార్జునరావు, ఎకౌంట్స్ మేనేజర్ శ్రీనివాసబాబు, సేఫ్టీ ఆఫీసర్ నాగరాజు, కీసర వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ప్రత్యేక సమావేశం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 21 : పట్టణంలోని వైభవ్ రెసిడెన్సి ఫంక్షన్ హాలులో బుధవారం రోటరీ క్లబ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి మాట్లాడుతూ క్లబ్ సేవలను మరింత విస్తృతపరచాలన్నారు. అనంతరం బత్తుల శ్రీనివాసరావు, గుండా నాగేశ్వరరావు క్లబ్ సభ్యత్వం పొందారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ, రామకోటయ్య, డాక్టర్ మురహరిరావు, తెర్లిక శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, యనమదల వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన

రెంటచింతల, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని టీడీపీ పార్లమెంట్ రైతు విభాగం కార్యదర్శి చేరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మా జో జిరెడ్డి బుధవారం ఆరోపించారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీ నివాసరెడ్డిపై, విలేకర్ల మీద జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రతిపక్షాల నోరు నొక్కుతున్నారని దుయ్యబట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాచర్ల, ఫిబ్రవరి 21 : ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణ శివారులోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద ఓ వ్యక్తి బ్రిడ్జి దాటుతుండగా ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన క్షతగాతుడ్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేటకు అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాలు తెలిసిన వారు మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ప్రభుత్వ అరాచకాలను ఎండగట్టేందుకే ప్రజాపోరు

అమరావతి, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలో జరుగుతున్న ప్రభుత్వ అరాచకాలను ప్రజలలో అవగాహన కల్పించి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించే లక్ష్యంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు అన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ఆదేశాల మేరకు బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ప్రజాపోరు కార్యక్రమాన్ని జిల్లా పరిధిలో అమరేశ్వరాలయం వద్ద నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, రవిశంకర్, వెంగళరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మద్ది ధాత్రినారాయణ, నేరళ్ల హనుమంతరావు తో పాటు ఐదు మండలాల అధ్యక్షులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిశుద్ధ ఆరోగ్యమాత దేవాలయ మహోత్సవం

క్రోసూరు, ఫిబ్రవరి 21 : క్రోసూరులోని పరిశుద్ధ ఆరోగ్య మాత దేవాలయ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమరావతి రోడ్డులో ఉన్న ఆరోగ్య మాత దేవాలయాన్ని ఇటీవల కాలంలో పునర్నిర్మించారు. భక్తులకు అన్నదానం జరిగింది. ఎమ్మెల్యే శంకరరావు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

మాతృ భాష చాతుర్యం ఎనలేనిది

పెదకూరపాడు, ఫిబ్రవరి 21 : భాషలు ఎన్ని ఉన్నా మాతృ భాష మాధుర్యం ఎనలేనిదని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకట రమణ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ప్రపంచ మాతృ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం వెంకట రమణ మాట్లాడుతూ మాతృ భాషలోని మాధుర్యాన్ని పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. తెలుగు ఉపాధ్యాయులు శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. మాతృ భాషపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. గిడుగు రామమూర్తి తెలుగు భాషకు చేసిన కృషిగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● నకరికల్లు ఫిబ్రవరి 21 : తెలుగు భాషను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చేజర్ల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం షేక్ పాహీం అన్నారు. నకరికల్లు మండలం చేజర్ల జడ్పీ హైస్కూల్ లో బుధవారం అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవాన్ని నిర్వహించారు. మాతృ భాషలోనే అన్ని విషయాలను సమగ్రంగా అవగాహన చేసుకోవటం సాధ్యమవుతుందని గణిత శాస్త్ర అధ్యాపకుడు మోహనరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, మల్లిక, వెంకటరావు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రతిష్ఠ

పెదకూరపాడు, ఫిబ్రవరి 21 : మండలంలోని గారపాడు ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం జరుగుతుందని ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గణేష్ మాధవరావు, కార్యదర్శి కంకణాల శివాజీ బుధవారం తెలిపారు. ఉదయం 9:35 గంటలకు యంత్ర, బింబ ప్రతిష్ఠలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, విమాన గోపుర కలశ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, సీతారామ శాంతి కళ్యాణం, వేద ఆశీర్వచనం జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం జరుగుతుందన్నారు. పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావును కమిటీ సభ్యులు జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌ఈదా సామిరెడ్డి, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పరస మాజీ సర్పంచ్ నూతలపాడు వెంకట శివరావులను జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి శివాజీ దంపతులు ఘనంగా సత్కరించారు.

దేవస్థాన ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే పీఆర్కే

కారంపూడి, ఫిబ్రవరి 21 : మండలంలోని లక్ష్మీపురంలో శ్రీఆంజనేయస్వామి దేవస్థాన జీవధ్వజ, కీర్తిధ్వజ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే పీఆర్కేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, జడ్పీటీసీ షేక్ షఫి, సర్పంచ్ సైదులు, వజ్రాల వెంకటరామిరెడ్డి, ఎర్ర గురవారెడ్డి, శివారెడ్డి, వెంకటరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, ఆశం విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలతోనే మీడియాపై దాడులు

రెంటచింతల, ఫిబ్రవరి 21 : ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రసంగిస్తున్న ప్రతి బహిరంగ సభలోను తాను యుద్ధం చేస్తున్నది కొన్ని మీడియా సంస్థలతోనే అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడమే ఆయా సంస్థల విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు కారణమని, దీనికి సీఎం ప్రధాన బాధ్యుడవుతాడని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత జి.శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి రవి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హింసతో సమాధానం చెప్పాలనుకుంటే ఇక ప్రజాస్వామ్యం ఎందుకుని ప్రశ్నించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 : భార్య, భర్తల మధ్య గొడవలు నేపథ్యంలో భార్య ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పట్టణంలోని 29వ వార్డులో బుధవారం జరిగింది. వార్డుకు చెందిన మస్తాన్‌వలి, షేక్ రహంతుల్ దంపతులు హోటల్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అప్పులు ఎక్కువ అవ్వటంతో భార్య రహంతుల్‌ను భర్త మస్తాన్‌వలి ప్రశ్నించాడు. దీంతో క్షణికావేశంలో రహంతుల్ శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుంది. దీంతో ఆమె 70 శాతం శరీరం కాలి పోయింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు.

తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పై దాడి దుర్మార్గం

పెదకూరపాడు, ఫిబ్రవరి 21 : తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి పై జరిగిన హత్యాయత్నం వైసీపీ దుర్మార్గపు చర్య అని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. శ్రీనివాసరెడ్డి పై ఒంగోలులో మారణాయుధాలతో దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే పత్రికలపై దాడులు : కొమ్మాలపాటి

అమరావతి, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం ఓటమి చెందుతున్న భయంతో వైసీపీ నాయకులు పత్రికలపై దాడులకు పాల్పడుతున్నారని పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. బుధవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల పక్షాన పోరాడుతున్న ఆంధ్రజ్యోతి, ఈనాడు పాత్రికేయులు, కార్యాలయాలపై వైసీపీ గూండాలు దాడులు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. మీడియాను భయపెట్టి నియంత్రించాలనుకోవడం పిరికిపంద చర్య అన్నారు. రానున్న ఎన్నికలలో జగన్మోహనరెడ్డి నిర్మించుకున్న అవినీతి సామ్రాజ్యాన్ని గంగలో కలిపేది పత్రికలేనని గుర్తుంచుకోవాలని శ్రీధర్ హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ అసహనానికి పరాకాష్ట : కొమ్మిశెట్టి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 : రానున్న ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలవుతానని తెలుసుకున్న వైఎస్ జగన్ రాష్ట్రంలో అరాచకానికి తెర తీశాడని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్రికా విలేకరులపై దాడులు, పత్రికా కార్యాలయంపై దాడులు ఇందులో భాగమేనన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ పై దాడి, ఒక పత్రికా విలేకరిపై, ఆ పత్రికా కార్యాలయంపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టులకు జనసేన ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

విలేకరుల పై దాడులకు ప్రతిపక్షాల ఖండన

క్రోసూరు, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆంధ్రజ్యోతి, ఈనాడు విలేకరులపై వైసీపీ గూండాలు దాడులు నిర్వహించటం హేయమైన చర్య అని పలు ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు ఖండించారు. విలేకరులపై దాడులను ఖండిస్తూ వారు వేర్వేరుగా బుధవారం ప్రకటనలు విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాంద్రు కాశయ్య, శివసేన పార్టీ రాష్ట్ర నాయకులు వినోదుల నరసింహారావు సీపీఎం సీనియర్ నాయకులు ఆవుల అంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు తదితరులు విలేకరుల పై జరిగిన దాడులను ఖండించారు. విలేకరులపై దాడులను టీడీపీ నాయకులు దుద్దుల యోహాన్, నలజాల సదాశివరావు, తోకా వెంకటరావు, గుడిపాడు బాషా తదితరులు కూడా ఖండించారు.

విలేకరులపై దాడి సిగ్గుచేటు : బత్తుల

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 21 : అసమర్ధ, అవినీతి పాలనను ప్రజలకు తెలియజేస్తున్న విలేకరులపై వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటని టీడీపీ మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు అన్నారు. ముప్పాళ్ళలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో విలేఖరులపై జరుగుతున్న దాడులను ఆయన ఖండించారు. సమావేశంలో బత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభు త్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అక్రమాలను ప్రజలకు తెలియజేస్తున్న ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల విలేకరులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారిపై హత్యానేరం కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు.

వెంకట్రామయ్య మృతి టీడీపీకి తీరని లోటు : కన్నా



వెంకట్రామయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి 21 : శనగపూల వెంకట్రామయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనగపూల నరసింహారావు తండ్రి వెంకట్రామయ్య మంగళవారం రాత్రి మృతి చెందారు. కన్నా లక్ష్మీనారాయణ బుధవారం గ్రామానికి వచ్చి వెంకట్రామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, పార్లమెంటు కమిటీ సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, మండల పార్టీ ఉపాధ్యక్షులు వర్ల శ్రీను, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శనగపూల వెంకయ్య, మండల బీసీ సెల్ అధ్యక్షులు నల్లగొర్ల నరసింహారావు, మాజీ సర్పంచ్ వాసా వెంకటేశ్వర్లు, వేపూరి రామయ్య, కోట జోసఫ్, బుర్రి రాంబాబు, కస్తాల దాసు, జంగం నరసింహరావు తదితరులు ఉన్నారు.

ముస్లిం మైనార్టీలను మోసం చేసిన సీఎం జగన్

● టీడీపీ మైనార్టీ సెల్ నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 : రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలను సీఎం జగన్ మోసం చేశారని టీడీపీ మైనార్టీ సెల్ నేతలు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ షాదీ తోఫా పేరుతో ముస్లింలను సీఎం మోసం చేశారన్నారు. దుల్హన్ పథకాన్ని రద్దు చేశారన్నారు. విద్యుత్ వాడకం మూడు వందల యూనిట్లు దాటకూడదని షరతులు పెట్టారన్నారు. ముస్లిం మైనార్టీలకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జానీ ఖాజావలి, చిన అబ్దుల్లా, మాబూ సుభానీ తదితరులు ఉన్నారు.

జూపూడి ప్రభాకర్ క్షమాపణ చెప్పాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 : జూపూడి ప్రభాకర్ మాల కులాన్ని అడ్డం పెట్టుకొని కులాన్ని తక్కువ చేసి మాట్లాడటం తగదని మాల మహానాడు నేతలు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విదేశీ విద్యా పథకానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు తీసివేసి జగన్ పేరు పెట్టడాన్ని ప్రభాకర్ సమర్ధించటం తగదన్నారు. ఇటీవల ప్రభాకర్ మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద మాలలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు నేతలు గుంటూరు ఆశీర్వాదం, ఏకుల రాజశేఖర్, మాలె పద్మారావు, మాతంగి సుధాకర్, మాలె కిరణ్ కుమార్, కమల్ కుమార్, మాతంగి రాహుల్ తదితరులు ఉన్నారు.

కొమ్మాలపాటికే పెదకూరపాడు టీడీపీ సీటు ఇవ్వాలి

పెదకూరపాడు, ఫిబ్రవరి 21 : పెదకూరపాడు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే సీటు స్థానిక మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కే ఇవ్వాలని మండలంలోని టీడీపీ ముఖ్య నేతలు స్థానిక సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఐదు సంవత్సరాల వైసీపీ విధ్వంసకర పాలనలో అవినీతి, అక్రమాలపై అలుపెరగని పోరాటాలు చేసి కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉన్న కొమ్మాలపాటికే బీ ఫారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాసన సభ్యునిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిన వ్యక్తి శ్రీధర్ అని, శ్రీధర్‌కే ఎమ్మెల్యే సీటు కేటాయించాలని తీర్మానించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుకు ఏకవాఖ్య తీర్మాన సందేశాన్ని పంపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, వడ్లమూడి అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, బీసీ సెల్ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, మండల టీడీపీ నేతలు ఏరువ బాలిరెడ్డి, షేక్ రఫీ, షేక్ అజ్మొల్లా, పాటిబండ్ల శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అనంత రామయ్య అందించిన సేవలు మరువ లేనివి



అనంత రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కంచేటి సాయి తదితరులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 21 : సత్తెనపల్లి పాత తాలూకా ప్రాంతంలో విద్యాభివృద్ధికి హెచ్‌ఎంగా పని చేసిన పాతూరి అనంత రామయ్య అందించిన సేవలు మరువ లేనివని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో బుధవారం పాతూరి అనంత రామయ్య దశ దిన కర్మ జరిగింది. పలువురు వక్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్తెనపల్లి ప్రాంతంలో ఎంతో మందిని విద్యావంతులుగా అనంత రామయ్య తీర్చిదిద్దారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డు ఉపాధ్యాయులు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వ్యాక్సినేషన్ పై గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శివ శంకర్, డీఎంహెచ్‌వో తదితరులు

పల్స్ పోలియోను జయప్రదం చేయాలి: కలెక్టర్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 21: పల్స్ పోలియోను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ బుధవారం పేర్కొన్నారు. మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియోకు జిల్లా అధికారులతో ఆయన చాంబర్‌లో వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1.86 లక్షల మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు మార్చి 3వ తేదీన పోలియో కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయించాలన్నారు. మార్చి 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరిగి వ్యాక్సినేషన్ వదిలిపోయిన వారికి వేస్తారన్నారు. జిల్లాలోని పంచాయతీ రాజ్, పోలీసు, ఐసీడీఎస్, విద్యా శాఖ, మునిసిపల్ శాఖ, ఆర్టీసీ, రైల్వే, పబ్లిక్ రిలేషన్స్ శాఖల వారు సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. జిల్లాలో మొత్తం 1135 పోలియో కేంద్రాలు, 70 సంచార పోలియో బృందాల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బీ రవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బీ గీతాంజలిలు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 11 ఫిర్యాదులు



డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 21: నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని కలెక్టర్ శివశంకర్ చేపట్టారు. ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఓటర్ల నమోదు, తొలగింపులు, బదిలీలకు సంబంధించి 11 ఫిర్యాదులు అందాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో 277 చర్చిలకు నిధులు

● టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజే స్వామిదాసు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 277 చర్చిలకు రూ.45కోట్లు నిధులు ఇచ్చారని, కానీ జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ రోజు వరకు ఒక్క చర్చికి కూడా నిధుల ఇవ్వలేదని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఏజే స్వామిదాసు ఆరోపించారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏజే స్వామిదాసు మాట్లాడుతూ జెరూసలేంకు 2500 మందిని చంద్రబాబు పంపించారని, ఈరోజు వరకు జగన్‌రెడ్డి ఒక్కరిని కూడా పంపలేదన్నారు. గుంటూరు నడికుడిరోడ్డులో రెండు ఎకరాలలో క్రిష్టియన్ భవనం రూ.10 కోట్లతో 80శాతం పనులు పూర్తయ్యాయని, అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రూ.5 కోట్లు ఇస్తే పనులు పూర్తయ్యేవన్నారు. బ్రదర్ అనిల్, విజయమ్మలు పాస్టర్లు వచ్చి అదిచేస్తాం, ఇదిచేస్తాం అని చెప్పి ఇప్పుడు ఎక్కడ ఉన్నారో అందరికీ తెలుసునన్నారు. కొత్తగా విమలారెడ్డి క్రైస్తవులను, పాస్టర్లను మోసం చేయడానికి వస్తున్నారని, వీరిని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 95 వేలమంది పాస్టర్లు ఉంటే కేవలం 8500 మందికి మాత్రమే జగన్‌రెడ్డి గౌరవవేతనం ఇస్తున్నాడన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రతి పాస్టర్‌కు గౌరవవేతనం ఇప్పించే బాధ్యత తీసుకుంటామన్నారు.

సమావేశంలో టీడీపీ క్రిష్టియన్ సెల్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మల్లవరపు జోసఫ్ అనిల్‌కుమార్, శ్యామ్‌స్వరూప్, ఎస్.సుధీర్ పాల్గొన్నారు.

వంద పనిదినాలు కల్పించడమే లక్ష్యం

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

కనమర్లపూడి (శావల్యాపురం) ఫిబ్రవరి 21: గ్రామాల్లోని ప్రతి పేద కుటుంబానికి వంద పనిదినాలు కల్పించి వారి ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. మండలంలోని కనమర్లపూడిలో జరుగుతున్న పంటకుంట పనులను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎక్కువమంది కూలీలకు పనిదినాలు కల్పించి నీటికుంట పనులు త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. కూలీ తక్కువగా పడుతుండడంతో ఉపాధి పనులకు ఆసక్తి చూపలేకపోతున్నామని, పని పూర్తయిన తర్వాత ఫొటో తీసేందుకు ఆలస్యమవుతుండడంతో ఇబ్బంది పడుతున్నామని కూలీలు డ్వామా పీడీతో మొరపెట్టుకొన్నారు. కూలీలకు కొలతలను నిర్దేశించి గరిష్ఠ వేతనం రూ.272లను అందించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 81లక్షల పనిదినాలను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా 79.5లక్షల పనిదినాలు పూర్తయ్యాయని, రోజూ 22వేలమంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారన్నారు. 12వేల కుటుంబాలకు వంద పనిదినాలు పూర్తయ్యాయని, మార్చి నెలాఖరుకు 25వేల కుటుంబాలకు వంద పనిదినాలు పూర్తయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. శావల్యాపురం మండలానికి 2.64లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికే పూర్తయిందని, మార్చిలో మరో 40వేల పనిదినాలు కల్పించేందుకు సిద్ధం చేశామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు రాగులు, సజ్జలు, మిల్లెట్లతో పిండి వంటలు, తేనె, పుట్టగొడుగుల తయారీ విధానాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీవో కటారపు రామారావు, జేఈ సుధాకర్, టీఏ బేబీరోజ, ఫీల్డ్ అసిస్టెంట్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 21: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని లింగంగుంట్లలో గల ప్రభుత్వ వైద్యశాలలో హెచ్‌డీఎస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎక్కువగా నిధులు కోరతామన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎస్ రంగారావు, డాక్టర్ మంత్రునాయక్, శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన పలువురు ఎస్ఐలు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 21: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పట్టణానికి బదిలీ అయిన ఎస్ఐలు బుధవారం జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలసి పూల మొక్కను అందజేశారు. నరసరావుపేట మొదటి పట్టణ ఎస్ఐ సుమన్, రెండో పట్టణ ఎస్ఐ అశోక్‌బాబులు ఆయనను కలిశారు.



జూనియర్ కళాశాల ఆవరణలో మిగిలిన అన్నం రాశులు, చేపలచెరువులకు, పందుల దాణా కోసం అన్నంను తరలిస్తున్న ఆటోలు

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు స్పందన కరవు

● మిగిలిపోయిన ఆహార పదార్థాలు ● చేపల దాణాకోసం తరలింపు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 21: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదినం కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో ఆ పార్టీ నాయకులు, అభిమానులకు మంగళవారం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా పల్నాడు రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ఆసాంతం ముగిసేంతవరకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించకపోవడంతో అంచనాలు తలక్రిందులయ్యాయి. కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరవుతారని భావించినప్పటికీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో పెద్దసంఖ్యలో అన్నం రాసులు మిగిలిపోయాయి. బుధవారం ఆటోల్లో వచ్చిన కార్మికులు మిగిలిపోయిన అన్నాన్ని కాలేజీ ఆవరణలో గుంతలుతీసి కొంత అన్నాన్ని, మరికొంత అన్నాన్ని ఆటోల ద్వారా కొందరు చేపల చెరువులకు, పందుల దాణాకు ఉపయోగించుకునేందుకు తీసుకెళ్లారు. దీంతో మిగిలిపోయిన అన్నం రాశులను చూసి స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. ఉదయాన్నే కళాశాల ఆవరణలో వాకింగ్‌కు వచ్చిన మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు అన్నం రాసులు పెద్ద మొత్తంలో మిగిలిపోవటంతో ముక్కున వేలేసుకున్నారు.

పత్రికా కార్యాలయం, జర్నలిస్టులపై దాడికి నిరసన



నరసరావుపేట గాంధీ విగ్రహం వద్ద నిలబడి నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు



పట్టణంలో నిరసన ర్యాలీ చేస్తున్న మీడియా ప్రతినిధులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వరుసగా జర్నలిస్టులు, పత్రిక కార్యాలయంపై దాడికి నిరసనగా బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజాసంఘాలు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ముందుగా మున్సిపల్ కార్యాలయం సమీపంలో జర్నలిస్టులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పత్రికా స్వేచ్ఛపై దాడి నశించాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీచేసి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సందర్భంగా సీపీఐ నాయకడు ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ కర్నూలులో ఈనాడు విలేకరిపై జరిగిన దాడిని, అంతకుముందు ఆంధ్రజ్యోతి జర్నలిస్టుపై జరిగిన దాడిన ఖండించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు నంద్యాల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వరుసగా పత్రికా కార్యాలయం, జర్నలిస్టుల మీద దాడులు జరగటం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో పుల్లంశెట్టి నాగరాజు, ఎంఐఎం కరిముల్లా, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, సీపీఐ నాయకులు వైదన వెంకట్ ప్రజా సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

జిల్లా నుంచి బహిష్కరించాలి: షేక్ కరిముల్లా

రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టు శ్రీకృష్ణమీద దాడిచేసిన వారిపై రౌడీషీట్ తెరవాలని, కర్నూల్ లో ఈనాడు కార్యాలయంపై దాడిని చేసిన వారిని జిల్లా బహిష్కరణ చేయాలని ఎంఐఎం గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రంలో ప్రతికా స్వేచ్ఛను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

రాష్ట్రంలో పత్రికా సేచ్ఛను కాపాడాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ శివశంకర్ లోతేటికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాపర్ల జగ్గారావు, జనసేన శ్రీనివాసరావు, మాలమహానాడు గోదా జాన్‌పాల్,గోదా రమేష్‌బాబు, సీపీఐ వైదన వెంకట్, బూదాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గూండాల దాడి దుర్మార్గం

ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై, కర్నూలో ఈనాడు కార్యాలయంపై వైసీపీ గూండాల దాడి దుర్మార్గం అని పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు అన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ దాడులను ఖండించాలన్నారు.

మీడియాపై దాడులు అప్రజాస్వామికం

రొంపిచర్ల, ఫిబ్రవరి 21: మీడియా సంస్థ విలేకరులపై దాడులు అప్రజాస్వామికమని పల్నాడు జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే వారిపై ఈ విధంగా దాడులు చేయటం దారుణమన్నారు. ఓటమి భయంతోనే ఇటువంటివి జరుగుతున్నాయన్నారు. ఉద్దేశపూర్వకంగానే ముఖ్యమంత్రి దాడులు చేయిస్తున్నారని తెలిపారు. ఆయన ప్రతి సభలోను ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5ల పేరు ఎత్తకుండా సభ ముగించలేదన్నారు. సైకోలాగా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. పోలీసు శాఖ తీరు దాడులను ప్రోత్సహించేలా ఉందన్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం నేత

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పత్రికా కార్యాలయాలపై, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను టీడీపీ పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం వెల్లంపల్లి రవిశంకర్ బుధవారం ఖండించారు. ఈ దాడులకు బాధ్యులైన వారిని తక్షణం గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పత్రికా కార్యాలయంపై దాడి అనాగరికం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 21: కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడి రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలనకు నిదర్శనమని తెలుగు మహిళా నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియా సంస్థలపై, విలేకరులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పత్రికా కార్యాలయాలపై, విలేకరులపై వరుస దాడులు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని?, సీఎం జగన్ కుట్రలో భాగంగా ఈ దాడులు జరుగుతున్నట్టు అనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి జెరీనా సుల్తానా, నియోజకవర్గ మహిళా అధ్యక్ష, కార్యదర్శులు అమరా రమాదేవి, పోపూరి లక్ష్మి, పట్టణ మహిళ అధ్యక్ష, కార్యదర్శులు అద్దంకి అనితాబాయి, రాయి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దోచుకున్న ఎమ్మెల్యే బొల్లా

● స్టేడియం పేరుతో నిధుల దుర్వినియోగం
● సమగ్ర విచారణ చేపట్టి, రికవరీ చేయాలి
● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



స్టేడియం పేరుతో నిధుల దుర్వినియోగంపై డిగ్రీ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ, టీడీపీ, జనసేన నాయకులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 21: స్టేడియం పేరుతో ప్రజాధనాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దోచుకున్నాడని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. అనుమతులు లేకుండా అనధికారికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిలో స్టేడియం పేరుతో జరిగిన నిధుల దుర్వినియోగంపై టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీవీ ఆంజనేయులు, జనసేన సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్‌లు హాజరై మాట్లాడుతూ స్టేడియానికి స్థలం కేటాయింపు అనుమతులు లేకుండా, గంగినేని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని ఆక్రమించి, రూ.1.80కోట్లు ప్రజాధనాన్ని ఖర్చుచేసి చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టి స్టేడియం అంటూ బొల్లా బ్రహ్మనాయుడు పేరు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. అక్రమ నిర్మాణంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకొని అవినీతి సొమ్మును రికవరీ చేయాలని జీవీ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించాల్సిన జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) కోటి రూపాయల నిధులను అక్రమంగా కేటాయించి దుర్వినియోగం చేయడమే కాకుండా రూ.80లక్షలు మున్సిపల్ సాధారణ నిధులను ఖర్చుచూపి దోచుకున్నారని విమర్శించారు. కాంపౌండ్ వాల్ కట్టి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరు పెట్టుకోవడమేనా స్టేడియం అంటే అని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండకు వచ్చిన సమయంలో వైఎస్సార్ స్టేడియం అని బ్యానర్ కట్టి సీఎం ఊరు దాటగానే బ్యానర్‌ను తొలగించిన ఘనుడు బొల్లా అని అన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ అనుమతి లేకుండా కాలేజీ స్థలం చుట్టూ గోడకట్టి డీఎంఎఫ్ నిధులు కాజేయడమే కాకుండా పట్టణంలోని 32వార్డుల్లో ఖర్చు చేయాల్సిన మున్సిపల్ సాధారణ నిధులు రూ.80లక్షలు కాజేశారని ఆరోపించారు. కూతవేటు దూరంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో వచ్చిన మట్టిని స్టేడియంలో నింపి ఎమ్మెల్యే లక్షల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో స్టేడియం, పార్కు, షాదీఖానా, టీటీడీ కల్యాణ మండపం, కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ తదితర అభివృద్ధి నిర్మాణ పనులకు ఎన్ఎస్పీ స్థలం కేటాయించడం జరిగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బ్రహ్మనాయుడు వీటిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రానున్న జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వంలో ఎన్ఎస్పీ స్థలంలో స్టేడియం నిర్మాణం చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షమీమ్‌ఖాన్, పి.వి.సురేష్, పత్తిపూర్ణ, గంధం కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి పి.అభిమన్యు, ఎ.అనిల్‌కుమార్, జి.మణికంఠ, పసుపులేటి రాజబాబు, కె.కిషోర్‌బాబు, చిన్ని, తుమ్మా అనిల్ కుమార్, రాజవరపు వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన తండావాసులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

రాముడుపాలెం తండా నుంచి టీడీపీలోకి 25 కుటుంబాలు

వినుకొండ, ఫిబ్రవరి 21: నూజెండ్ల మండలం పువ్వునూతల పంచాయతీ రాముడుపాలెంతండాలో వైసీపీకిచెందిన 25 కుటుంబాలు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి జీవీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు, కస్టర్ ఇన్‌చార్జి బచ్చు అంజిరెడ్డి, నూజెండ్ల మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణయాదవ్, యూనిట్ ఇన్‌చార్జి మరిడి సురేష్, సీనియర్ నాయకులు నాగయ్య, సుబ్బారావు, కన్నానాయక్, సోమ్లానాయక్, బాలకృష్ణ, రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంతగుడిపాడు పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

రొంపిచర్ల, ఫిబ్రవరి 21: మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలకు 1979-80 పదో తరగతి పూర్వ విద్యార్థులు మైక్‌సెట్‌ను మంగళవారం సాయంత్రం బహూకరించారు. సుమారు రూ.25వేలు విలువచేసే మైక్‌సెట్‌ను ఉప విద్యా శాఖ అధికారి కే.వేణుగోపాల్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఎన్.శివశంకర్, గోరంట్ల ఆదినారాయణ, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ

వినుకొండ, ఫిబ్రవరి 21: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని నిర్మలా ఉన్నత పాఠశాలలో ఇండియన్ అసోసియేషన్ ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్స్ సభ్యుల సహకారంతో టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏసీటీ సౌత్‌జోన్ సెక్రటరీ ఎం.కృష్ణమూర్తి, ఐఏపీటీ వైస్ ప్రెసిడెంట్ కె.రవీంద్రకుమార్ బోధనా పద్ధతులపై విద్యార్థుల దృష్టిపై ఉపాధ్యాయులకు వివరించారు.

విజిలెన్స్ అధికారులమంటూ డబ్బు వసూలుపై కేసు నమోదు

నూజెండ్ల, ఫిబ్రవరి 21: మండలంలోని ములకలూరులో విజిలెన్స్ అధికారులమంటూ ట్రాక్టర్ యజమానినుంచి డబ్బులు తీసుకున్నారు. దీనిపైకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి బుధవారం తెలిపారు.

ఘనంగా నాగ మునీంద్రస్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని పేరూరుపాడులో నాగ మునీంద్రస్వామి తిరునాళ్ళ మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ ప్రభలపైనుంచి ప్రసంగించారు.

కొనసాగుతున్న ఎమ్మెల్యే వ్యతిరేక సమావేశాలు

నరసరావుపేట, ఫిబ్రవరి 21: నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా సొంత పార్టీ నేతలే సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల సమావేశాలు నిర్వహించారు. బుధవారం రాత్రి పట్టణంలోని 32వ వార్డులో వైసీపీ నేత డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి నేతృత్వంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలు కార్యకర్తలకు అండగా ఉంటానని బ్రహ్మారెడ్డి హామీ ఇచ్చారు. సమావేశంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు ఎస్ఏ హనీఫ్, జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, గెల్లి సుబ్బారెడ్డి, యన్నం రవీంద్రరెడ్డి, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు నేలటూరి మురళి, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 21: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డు సమీపంలోని రైల్వేబ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. బాధిత బంధువుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా కురిచేడు మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన తిరుమల, మువ్వా మంగమ్మ, గోపిలు మంగళవారం బొల్లాపల్లి మండలం పేర్లపాడు తిరునాళ్లకు వెళ్లి బుధవారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వినుకొండ-శ్రీశైలం ఆర్టీసీ బస్సును ఢీకొంది. ప్రమాదంలో గోపి అనే యువకుడికి కాలు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని బాధితులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం తిరుమల, గోపిలను మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పాత పెన్షన్ అమలు అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి: యూటీఎఫ్

వినుకొండ, ఫిబ్రవరి 21: ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని అంటూ బుధవారం యూటీఎఫ్ నాయకులు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు.

బీమా సొమ్ము చెల్లించాలంటూ నిరసన

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 21: ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామానికి చెందిన గర్నెపూడి శాంతి భర్త మహేష్‌బాబు 5 సంవత్సరాల క్రితం బైక్ ప్రమాదంలో మరణించాడు. ప్రభుత్వం నుంచి బీమా రాకపోవడంపై వినుకొండ నరసరావుపేట రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి బుధవారం నిరసన దీక్ష చేపట్టారు.

మద్దతు ధరకు కందుల కొనుగోలు: ఏడీఏ రవిబాబు

ఈపూరు, ఫిబ్రవరి 21: రైతులు పండించిన కంది పంటను ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని ఏడీఏ రవిబాబు అన్నారు. మండలంలోని కొండ్రముట్లలో రైతులు నూర్పిళ్లు చేస్తున్న కంది పంటను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. అనంతరం రైతులకు పంటను అమ్ముకోవడంపై అవగాహన కల్పించారు. క్వింటాకు రూ.9600లుకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నూరుశాతంకంది పంటను కొనుగోలు చేస్తామన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన తుళ్ళూరు శివ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారిని ఫోన్‌లో పరామర్శించారు. వారి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ప్రత్తిపాటి అందించిన సాయాన్ని టీడీపీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, గుడిపల్లి సాంబశివరావు, తెల్లపాటి మోహన్‌కృష్ణ, కందుల రమణ, కె.కరుణ, కె.రమేష్, మేకపోతు బొల్లయ్య, నిమ్మకాయల ప్రసాదు, సుధాకర్, వెంకటేష్‌లు అందజేశారు.



గోడ తొలగించాలని నిరసన తెలుపుతున్న బాధితులు

రహదారిపై గోడను తొలగించాలని ధర్నా

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21: జాతీయ రహదారి నుంచి గొర్రెల మండి పక్కగా పసుమర్రు వెళ్ళే రహదారిపై రాకపోకలకు వీల్లేకుండా కట్టిన గోడను తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రహదారి ఆక్రమణ బాధితులు ధర్నా చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మామ విడదల లక్ష్మీనారాయణ ఈ గోడ కట్టారని బాధితులు ఆరోపించారు. సర్వే నెంబరు 16/ఏకు సంబంధించిన స్థలంలో ఈ గోడ కట్టినందు వల్ల పసుమర్రు గ్రామానికి తారురోడ్డు మంజూరైనప్పటికీ పనులు జరగని పరిస్థితి ఉన్నదని వారు తెలిపారు. ఈ కారణంగా గ్రామ అభివృద్ధి కుంటుపడుతున్నదని బాధితులు తెలిపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు నాయకులు ఆరోపించారు. తక్షణం గోడను తొలగించకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. సుమారు వందమంది బాధితులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21: నియోజకవర్గంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా ఉండే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ఏరియా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా హాల్‌టిక్కెట్లు జారీ చేయాలని కోరారు. హాల్ టిక్కెట్లు ఇవ్వని విద్యాసంస్థల వద్ద ఆందోళనలు జరుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయినాయక్ మెగావత్, ఎం.ఫణి, పృథ్వీ, నాని తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీలను తొలగించండి

కలెక్టర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

శావల్యాపురం, ఫిబ్రవరి 21: వినుకొండ నియోజకవర్గంలోని ఓటర్ల తుదిజాబితాలో 5వేల వరకు డబుల్ ఎంట్రీలు ఉండగా ఫారం-7 దరఖాస్తులు పెట్టినా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు, బీఎల్వోలు వాటిని తొలగించకుండా అలానే ఉంచారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాపర్ల జగ్గారావు, పల్నాడు జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య నర్సరావుపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. శావల్యాపురం మండలం గుంటుపాలెం ప్రాథమిక పాఠశాలలోని 141 పోలింగ్‌బూత్‌ను అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వసతులు లేవన్న కారణంతో స్థానిక ఎన్నికల అధికారులు రైతుభరోసా కేంద్రంలోకి మార్చడంతో గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు అన్నవరపు నరేంద్ర కేంద్ర ఎన్నికల సంఘానికి గతంలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పునఃపరిశీలన చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదే పాఠశాలలో నడుస్తున్న అంగనవాడీ కేంద్రం, మౌలిక వసతుల ఫొటోలను, ఆధారాలను ఫిర్యాదుదారుడు నరేంద్ర కలెక్టర్‌కు అందజేసి పునఃపరిశీలన చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఫిర్యాదులపై విచారణ జరిపిస్తానని తెలిపారు. వారితో పమిడిపాడు టీడీపీ నాయకులు ఎండ్లూరి సునీల్ చౌదరి ఉన్నారు.

మతుకుమల్లిలో జ్వర బాధితులకు వైద్యపరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మతుకుమల్లి (శావల్యాపురం) ఫిబ్రవరి 21: మండలంలోని మతుకుమల్లిలో జ్వర పీడితుల కోసం బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించి 70మంది అనుమానితులకు డెంగీ, మలేరియా వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొందరు జ్వరాలు, నొప్పులతో బాధ పడుతున్నట్లు తమదృష్టికి రావడంతో ఆశా కార్యకర్తలతో జ్వరాల సర్వే చేయించామని, వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి అనుమానితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు శంకర్‌సింగ్, పృథ్వీరాణి, పావని, సంకీర్తన, సునీత, శ్రీదేవి, షీబారాణి, ఏఎన్ఎంలు శ్రీలలిత, ఏసులీల తదితరులు పాల్గొన్నారు.

స్థానికేతరులకు ఓటు హక్కు కల్పించొద్దంటూ వినతి



వినతిపత్రం అందచేస్తున్న అజారుద్దీన్

యడ్లపాడు, ఫిబ్రవరి 21: స్థానికేతరులకు ఓటు హక్కు కల్పించవద్దంటూ యడ్లపాడు మండలం కోట గ్రామస్థులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మోజెస్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు అజారుద్దీన్ మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు కూలి పనుల కోసం గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళుతుంటారు. ఈ ఏడాది కూడా పనుల కోసం వచ్చిన వారిని వైసీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి ఓటర్ల జాబితాలో చేర్పించారని ఆరోపించారు. సదరు వ్యక్తులకు వారి స్వగ్రామంలో ఓట్లు ఉన్నాయని, ఆ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారికి ఓటు హక్కు కల్పించవద్దని కోరినట్లు అజారుద్దీన్ తెలిపారు.

ఎయిడ్స్ వ్యాధిపై కళాజాత

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21: జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కోసం కళాజాత బృందంతో వీధి నాటకాల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని బుధవారం ఇక్కడ నిర్వహించారు. పట్టణంలోని గడియార స్తంభం, వడ్డెరపాలెం ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ విభాగం కౌన్సిలర్ హనుమంతరావు వ్యాధులపై అవగాహన కల్పించారు.

గార్డ్స్ ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21: స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో మాతృ బాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సాహితీ విమర్శలు డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సాహిత్యంపై పాఠశాలల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఆర్బీకేలో కంది పంట కొనుగోళ్లు: ఏడీఏ రవిబాబు

శావల్యాపురం, ఫిబ్రవరి 21: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలలో ప్రభుత్వం మద్దతుధరకు కందులు కొనుగోలు చేస్తుందని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. శావల్యాపురం, కనమర్లపూడి గ్రామాలలో కందిపంట కోసిన పొలాలను ఎంఏవో పి.ప్రవీణ్‌కుమార్‌తో కలసి బుధవారం పరిశీలించారు.